www.prajaswaramdaily.com

# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 315 | పేజీలు : 5 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | గురువారం 25-07-2024

MHR TV

www. mhrtv.com

## కాలేజీలు, స్కూళ్లే టార్గెట్

- గంజాయి, డ్రగ్స్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్న యువత
- రెండ్ హ్యాండెడ్ గా దొరికిపోతున్న విద్యార్థులు
- హై స్కూల్ నుంచి ఎంబీబీఎస్ వరకు టార్గెట్
- మాదకద్రవ్యాల నిరోధంపై సర్కార్ సీరియస్ యాక్షన్
- డ్రగ్ పెడ్లర్స్ పై ఉక్కుపాదం

2



## ఇంటర్నెట్ లేకున్నా.. వాట్సాప్!

**వాషింగ్టన్ జూలై 24 :** ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే ఫైల్స్ ను షేరింగ్ చేసుకునే విధంగా ఓ కొత్త ఫీచర్ పై వాట్సాప్ కృషి చేస్తోంది. ఆపిల్ 'ఎయిర్ డ్రాప్' , గూగుల్ 'నియర్ బై షేర్' మాదిరిగానే ఈ ఫీచర్ పనిచేయనున్నది. దీని ద్వారా డాక్యుమెంట్లు, వీడియోలు, ఫొటోలు, ఇతర ఫైళ్లను మొబైల్ డేటా పరిమితిని తినేయకుండానే చేరవేస్తుంది. ఈ ఫీచర్ ని iOS తో నడిచే డివైస్ లలో పనిచేసేలా డెవెలపర్లు రూపొందిస్తున్నట్లు సమాచారం.



# ఢిల్లీలో దీక్ష చేద్దాం

## ప్రతిపక్ష నేతగా కేసీఆర్ రావాలి



**హైదరాబాద్, జూలై 24 (ప్రజాస్వరం):** కేంద్ర బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై నేడు అసెంబ్లీలో వాడీ వేడి చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కేటీఆర్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేటీఆర్ అవగాహనా రాహిత్యంతో సభను తప్పుదోవ పట్టిస్తున్నారని, సభకు కేసీఆర్ ఎందుకు రాలేదని నిలదీశారు. దానికి స్పందించిన కేటీఆర్ మాకు జవాబు చెబితే చాలని, మీకు కేసీఆర్ అవసరం లేదని కౌంటర్ ఇచ్చారు. దాంతో రేవంత్ రెడ్డి తండ్రి పేరు చెప్పుకుని మంత్రిని కాలేదని. కింది స్థాయి నుంచి పైకి వచ్చానని, కేటీఆర్ ది మేనేజ్ మెంట్ కోటా అనుకున్నా, అంతకంటే దారుణమని వ్యంగ్యంగా మాట్లాడారు. దీంతో కేటీఆర్.. రేవంత్ పేమెంట్ కోటాలో సీఎం అయ్యారని మేమూ అనొచ్చు అని సమాధానమిచ్చారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఇప్పటి వరకు ఓ విద్యుత్ విధానమే లేదన్నారు. రూ. 7 లక్షల కోట్లు అప్పు చేసి వెళ్లిపోయారని విమర్శించారు. గత ప్రభుత్వ పాలనలోనే విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదన్నారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ 'మోదీ ప్రభుత్వాన్ని యాచిస్తే ఏమీ రాదని, శాసించి సాధించుకోవాలన్నారు. ఢిల్లీ తత్వం ఇంత కాలానికి కాంగ్రెస్ కు బోధపడిందని, కేంద్ర వివక్షను ఎండగట్టడంలో సహకరిస్తామన్నారు. గతంలో కేంద్రం సాయం చేయకపోయినా ఎంతో అభివృద్ధి చేశామని, ధైర్యం ఉంటే మోదీని విమర్శించండన్నారు. చీకటి ఒప్పందాలు మాకు అలవాటు లేదన్నారు. కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి ఏమీ మిగతా 2 లో..

- తేదీ మీరే నిర్ణయించండి
- 'తెలంగాణకు నిధులు తెచ్చుదో..సచ్చుదో తేల్చుకుందాం'
- బీఆర్ఎస్ నేత హరీశ్ రావు సవాల్ కు సీఎం రేవంత్ రెడ్డి ప్రతి సవాల్
- రెండో రోజు వాడీవేడిగా అసెంబ్లీ సమావేశాలు
- సీఎం, కేటీఆర్ మధ్య మాటల యుద్ధం
- జాబ్ క్యాలెండర్, నిరుద్యోగులు డిమాండ్లపై వాయిదా తీర్మానం
- తిరస్కరించిన స్పీకర్... ఎమ్మెల్యేల ఆందోళన
- ఆర్టీసీపై హరీశ్ వర్సెస్ పొన్నం




విలేకరులు కావలెను

ప్రజాస్వరం

పదిహేడు సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రజాస్వరం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.

సెల్ : 800 860 9999



విమానం కూలిపోయిన ప్రాంతంలో ఎగిసిపడుతున్న దట్టమైన పొగ (సర్కిల్ లో)

## కూలిన విమానం

- నేపాల్ రాజధాని ఖాట్మాండులో ఘోర ప్రమాదం
- విమానంలో సిబ్బంది సహా మొత్తం 19 మంది..
- 18 మంది మృతి, పైలెట్‌కు తీవ్రగాయాలు ఆస్పత్రికి తరలింపు
- టేకాఫ్ సమయంలో దుర్ఘటన

5




పార్లమెంట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఇండియా కూటమి

## రాజ్యసభ నుంచి ప్రతిపక్షాల వాకౌట్

- పార్లమెంట్ ఆవరణలో ఆందోళన
- కేంద్ర బడ్జెట్ పై నిరసన
- బీజేపీయేతర రాష్ట్రాలకు మొండిచేయి చూపించిందని విమర్శ
- మోదీ సర్కార్ రాజ్యాంగానికి విరుద్ధంగా నడుచుకుంటోందని ఆగ్రహం
- నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించిన తమిళనాడు


**న్యూఢిల్లీ జూలై 24 :** ఆర్థిక మంత్రి నిన్న వివక్షపూరితమైన బడ్జెట్ ప్రవేశపెట్టారని నిరసన తెలుపుతూ ప్రతిపక్షనాయకులు నేడు(బుధవారం) రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు. తాను రైతు నాయకులను ఆహ్వానించినప్పటికీ వారిని పార్లమెంటు ప్రాంగణంలోకి అనుమతించలేదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ బుధవారం మిగతా 2 లో..

# డేంజర్ బెల్స్..

- దేశంలో కలకలం రేపుతున్నాలుగు ప్రాణాంతక వైరస్ లు
- గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో చాందీపురా
- మహారాష్ట్రలో జికా, కేరళలో నిఫా..
- గుజరాత్ లో 16 మంది మృతి
- కేరళలో 14 ఏండ్ల బాలుడి మరణం
- వైరస్‌ల వ్యాప్తిని అడ్డుకునేందుకు ప్రభుత్వాల చర్యలు
- అప్రమత్తమైన పొరుగు రాష్ట్రాలు
- పరిస్థితిని ఎప్పటి కప్పుడు సమీక్షిస్తున్న కేంద్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ, జూలై 24 :** నిఫా, జికా, చాందీపురా ప్రాణాంతక వైరస్ లు భారత్ ను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అటు ఉత్తర భారతదేశంలో గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలు చాందీపురా వైరస్ తో సతమతమవుతుంటే, మహారాష్ట్రలో జికా వైరస్ విజృంభిస్తోంది. వీటికి తోడు కేరళలో నిఫా వైరస్ జోరు పెంచింది. మొత్తానికి 4 ప్రాణాంతక వైరస్ లు 4 రాష్ట్రాలను వణికిస్తున్నాయి. తాగాగా గుజరాత్ లో 50మంది చాందీపురా వైరస్ బారిన పడితే వారిలో 16 మంది మృతి చెందడం కలకలం సృష్టిస్తోంది. గుజరాత్ లో మిగతా 2 లో..



## ఆంధ్రప్రదేశ్‌లో విధ్వంస పాలన




ఢిల్లీ ధర్నాలో జగన్ కు మదతు తెలుపుతున్న ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్

- రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడిపిస్తున్నారు
- 45 రోజుల్లోనే 35కుపైగా హత్యలు జరిగాయి
- వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా
- రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్

2

# ఆంధ్రప్రదేశ్ లో విధ్వంస పాలన

- 45 రోజుల్లోనే 35 కుపైగా హత్యలు జరిగాయి
- వైసీపీ అధినేత జగన్
- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా
- రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తున్నదని ఆరోపణ

**న్యూఢిల్లీ, జూలై 24:** ఆంధ్రప్రదేశ్‌లో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆరోపించారు వైసీపీ అధినేత,మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి. ఏపీలో కొన్ని రోజుల నుంచి ప్రత్యర్థులను టార్గెట్ చేసుకొని విధ్వంసానికి ప్రభుత్వం పాల్పడుతోందని ఆరోపిస్తూ ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టారు. అంతకుముందు ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం చేస్తున్న విధ్వంసాన్ని కళ్లారా చూడాలంటూ రిక్వెస్ట్ చేశారు. ప్రత్యర్థులను పూర్తిగా నాశనం చేయడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పాలన సాగుతోందని ఆరోపించారు జగన్ మోహన్ రెడ్డి. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన 45 రోజుల్లోనే 35కుపైగా హత్యలు జరిగాయని వెయ్యికిపైగా అక్రమ కేసులు నమోదు అయ్యాయని మీడియాకు వివరించారు. వందల ఇళ్లు, ప్రభుత్వం, ప్రైవేటు ఆస్తులను కూడా ధ్వంసం చేశారని విమర్శించారు.

తమకు ఓటు వేయలేదని, తమకు ప్రత్యర్థులుగా ఉన్నారన్న ఒకే ఒక్క కారణంతో ఇదంతా చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో అసలు ప్రజాస్వామ్యమే లేదన్న జగన్ మోహన్ రెడ్డి తాము అధికారంలో ఉన్నప్పుడు ఎప్పుడూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడలేదని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో దాడులు, దౌర్జన్యాలు జరగలేదని వివరించారు. 45రోజుల్లోనే ఏపీ ప్రభుత్వం చేపట్టిన దుశ్చర్యలను కళ్లకు కట్టినట్టు ఫొటోగ్యాలరీ రూపంలో తీసుకొచ్చామని అన్నింటినీ పరిశీలించి ఏపీలో ఏం జరుగుతుందో అంచనాకు రావాలని అభ్యర్థించారు. ఎన్నికల ముందు రెడ్ బుక్ చూపిస్తూ అందరినీ బెదిరించిన లోకేష్ ఇప్పుడు ప్రభుత్వం భాగమై ఉన్నారని గుర్తు చేశారు. లోకేష్ చెప్పినట్టుగానే గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రతీకార దాడులు జరుగుతున్నాయన్నారు జగన్.


రెడ్ బుక్ పేరుతో పెద్ద పెద్ద హోర్డింగ్స్ పెట్టి మరీ జనాలను బెదిరిస్తున్నారని అన్నారు. పోలీసు అధికారులు పూర్తిగా పట్టించుకోవడం లేదని అసలు రాష్ట్రంలో శాంతి భద్రతలే పూర్తిగా అదుపు తప్పాయని అన్నారు జగన్. అందుకే ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేశారు.ఇప్పుడు చంద్రబాబు తీసుకొచ్చిన సంప్రదాయం మంచిదికాదన్నారు జగన్. ఇప్పుడు ఆయన అధికారంలో ఉండొచ్చని రేపు తాము రావచ్చని అప్పుడు తాము కూడా ఇలాంటివి ప్రోత్సహిస్తే పరిస్థితి ఏంటో గుర్తు చేసుకోవాలని జగన్ హెచ్చరించారు.

ఏపీలో జరుగుతున్న పరిణామాలపై ఢిల్లీలో ధర్నా చేస్తున్న జగన్‌కు ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్ మద్దతు ప్రకటించారు. ఏపీలో జరుగుతున్న దాడులను అఖిలేష్‌కు జగన్ వీడియో రూపంలో వివరించారు. అనంతరం మాట్లాడిన అఖిలేష్ అధికారంలోకి ఎవరు వచ్చినా ప్రత్యర్థులపై దాడులు చేయడం సరికాదన్నారు. అధికారంలో ఉన్న వాళ్లు శాంతియుతంగా ఉండాలని సూచించారు. ఒకరు ఇవాళ అధికారంలో ఉంటే రేపు మరొకరు అధికారంలో ఉంటారని గుర్తు చేశారు. ప్రాణాలు తీయడం, హత్యలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో కూడా బుల్డోజర్ సంస్కృతి నడుస్తోందని... ఎక్కడైనా ఇది మంచి పద్ధతి కాదన్నారు అఖిలేష్.

---

- గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా వినియోగిస్తున్న యువత
- రెండ్ హ్యాండెడ్ గా దొరికిపోతున్న విద్యార్థులు
- హై స్కూల్ నుంచి ఎంబీబీఎస్ వరకు టార్గెట్
- మాదకద్రవ్యాల నిరోదంపై సర్కార్ సీరియస్ యాక్షన్
- డ్రగ్ పెడ్లర్స్ పై ఉక్కుపాదం

# కాలేజీలు, స్కూళ్లే టార్గెట్



**హైదరాబాద్, జూలై 24 (ప్రజాస్వరం) :** తెలంగాణలో డ్రగ్స్, గంజాయి వాడకంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతుంది. డ్రగ్స్ అరికట్టడమే లక్ష్యంగా వరుస దాడులు చేస్తోంది. డ్రగ్ పెడ్లర్స్ లో భయానక వాతావరణం సృష్టిస్తుంది. అయినా నగరంలో ఏదో ఒక మూలన వాటి ఆనవాళ్లు కనిపిస్తూనే ఉన్నాయి. మొన్న ఆర్టీసీ బస్సులో తీసుకెళ్తున్న 7కోట్ల విలువ చేసే హెరాయిన్ పట్టుకోగా.. తాజాగా హైదరాబాద్ లో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా గుట్టు రట్టైంది. ఇద్దరు డ్రగ్స్ ముఠా సభ్యులను అరెస్ట్ చేశారు పోలీసులు. వారి నుంచి 40 కిలోల పాపిస్ట్రా, 10 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్ సీజ్ చేశారు. ఇదిలా ఉంటే డ్రగ్స్ వాడకంపై సంచలన ప్రకటన చేశారు తెలంగాణ పోలీసులు, తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో అధికారులు. నిర్ఘాంతపోయే నిజాలు వెల్లడించారు. కాలేజీలు, స్కూళ్లు, పబ్స్ అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ డ్రగ్స్, గంజాయి యథేచ్ఛగా యూత్ వాడేస్తోందని ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. పలు కాలేజీల్లో స్టూడెంట్స్ డ్రగ్స్ సేవిస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు తెలిపారు. ఉస్మానియా మెడికల్ కాలేజ్ లో ఆరుగురు జూడాలు గంజాయితో పట్టుబడ్డట్లు చెప్పారు. వారిపై చర్యలు తీసుకోవాలని మెడికల్ కౌన్సిల్ కు లేఖ రాసినట్లు తెలిపారు.

గురునానక్ ఇంజనీరింగ్ కాలేజీలో 15మంది గంజాయి తీసుకున్నట్లు విచారణలో తేలిందన్నారు. సింబయోసిస్ కాలేజీలో 25 మంది విద్యార్థులు గంజాయి సేవిస్తూ పట్టుపడ్డట్లు తెలిపారు. అంతేకాదు సీబీఐటీ కాలేజీలో ఓ విద్యార్థికి గంజాయి పాజిటివ్ వచ్చినట్లు చెప్పారు పోలీసులు. ట్రిబుల్ ఐటీ బాసర లాంటి సంస్థల్లో విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడి నట్లు గుర్తించారు. ట్రిబుల్ ఐటీ బాసర కు నాందేడ్ నుంచి గంజాయి వస్తున్నట్లు గుర్తించామన్నారు. జోగి పేట జేఎన్టీయూలో ముగ్గురు గంజాయితో పట్టుబడ గా.. ఇండస్ స్కూల్ తో పాటు సీబీఐటీకి చెందిన స్టూడెంట్స్ ఈ-సిగరేట్లకు అలవాటుపడ్డట్లు పోలీసులు తెలిపారు. డ్రగ్స్ నియంత్రణపై విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమా లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు పోలీసులు. స్కూ ల్స్, కాలేజీలు ఆవరణలో స్నిఫర్ డాగ్స్ తో తనిఖీ చేస్తున్నామని, స్కూల్ ఆవరణలో గంజాయితో పట్టుబడితే జువైనల్ యాక్ట్ పెడుతున్నట్లు తెలిపారు. సెలబ్రిటీలు చిరంజీవి, సుమన్, పీవీ సింధు లాంటి వారితో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పబ్ ల్లో డీజేలపై ప్రత్యేక నిఘా పెట్టి మైనర్లకు మద్యం సరఫరా చేయకుండా కఠిన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు అధికారులు. డ్రగ్స్ అరికట్టడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, హ్యూమన్ ఇంటెలిజెన్స్ తో పాటు టెక్నికల్ సహకారంతో డ్రగ్స్ ముఠాల ను వెంటాడుతున్నామని తెలిపారు అధికారులు. ఇక డ్రగ్స్ కి హాట్ స్పాట్ గా మారిన పబ్బులపై నిరంతర తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

---

# ..ప్రతిపక్షాల వాకౌట్

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. ' వారు రైతులు కనుకే వారిని అనుమతించి ఉండకపోవచ్చు. మేమే ఇక వారిని వెళ్లి కలుస్తాము' అన్నారు. మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ '' బడ్జెట్ కొందరికే సంతోషాన్ని కలిగించింది. ఇద్దరికి తప్పించి మిగతా వారందరికీ శూన్య హస్తం చూపింది'' అన్నారు.రాజ్యసభ చైర్మన్ జగ్దీప్ ధన్కర్ ప్రతిపక్షాలు వాకౌట్ చేశాక ' వారి ప్రవర్తన సరిగా లేదు. అంతరాయాన్ని రాజకీయ వ్యూహంగా, ఆయుధంగా మలచుకుంటున్నారు. దీని వల్ల ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు ఏర్పడగలదు' అన్నారు. ఇదిలావుండగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ బడ్జెట్ లో తమిళనాడును నిర్లక్ష్యం చేసినందుకు జులై 27న జరుగనున్న 'నీతి ఆయోగ్ సమావేశం' ను బహిష్కరించనున్నానని ప్రకటించారు. తమిళనాడుతో పాటు కర్నాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ కూడా ఈ సమావేశాన్ని బహిష్కరించనున్నాయి. కాగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ '' కేంద్ర బడ్జెట్ పేదలకు వ్యతిరేకంగా, రాజకీయ ఏకపక్షంగా ఉంది'' అని విమర్శించారు. ప్రజల సంక్షేమానికి కాక కేవలం ఎన్డీఏ మిత్రపక్షాలను సంతుష్ట పరిచేలా బడ్జెట్ ఉందని కూడా ఆమె అన్నారు.



పార్లమెంట్ వద్ద రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న రాహుల్ గాంధీ

---



# డేంజర్ బెల్స్..

(మొదటి పేజీ తరువాయి)

రోజు రోజుకూ చాందీపురా వైరస్ కేసులు పెరుగుతున్నాయి. పొరుగున ఉన్న మహారాష్ట్ర 2021 నుంచి అత్యధిక సంఖ్యలో జికా వైరస్ కేసులతో పోరాడుతోంది. మరోవైపు కేరళ రాష్ట్రంలో మలప్పురానికి చెందిన 14 ఏళ్ల బాలుడు నిఫా వైరస్ సోకి మరణించడంతో కేరళ ప్రభుత్వం వైరస్ నివారణ చర్యలను వేగవంతం చేస్తోంది. ఇది అంటువ్యాధి కావడంతో వైరస్ విస్తరించకుండా కేరళ ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. మహారాష్ట్రలో 2021 నుండి జికా వైరస్ కేసులు నమోదవుతున్నాయి. తాజాగా జూలై 19 నాటికి అత్యధికంగా 38 జికా ఇన్ఫెక్షన్లు నమోదయ్యాయి. పూణే జిల్లాలో 28 కేసులు నమోదవ్వగా.. కేరళలో కూడా పదుల సంఖ్యలో కేసులు నమోదయ్యాయి. ఇటు కర్ణాటకలో జికా వైరస్ కారణంగా మరణం సంభవించింది. గర్భిణీ స్త్రీలు మరియు వారికి పుట్టబోయే పిల్లలకు తీవ్రమైన ప్రమాదాలకు ప్రసిద్ధి చెందిన జికా వైరస్ కేరళ, కర్ణాటకలో మొదట బయటపడింది. ఈ వైరస్ ల యొక్క వేగవంతమైన వ్యాప్తి భారతదేశ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. జికా వైరస్ ప్రధానంగా దోమ కాటు ద్వారా, అలాగే రక్తమార్పిడి, లైంగిక సంపర్కం, తల్లి పాలివ్వడం ద్వారా వ్యాపిస్తుంది, ఈ వైరస్ దేశవ్యాప్తంగా ఆందోళనను రేకెత్తిస్తోంది.నిఫా వైరస్ సోకి మలప్పురానికి చెందిన 14 ఏళ్ల బాలుడు మృతి చెందడంతో కేరళలో అధికారులు అప్రమత్తమయ్యారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిపా వైరస్ (NiV)ని జూనోటిక్ వైరస్ అని వర్ణించింది, అంటే ఇది జంతువుల నుండి మనుషులకు సంక్రమిస్తుంది. ఇది కలుషితమైన ఆహారం లేదా ప్రత్యక్షంగా వ్యక్తి-నుంచి-వ్యక్తి పరిచయం ద్వారా కూడా వ్యాపిస్తుంది. పండ్ల గబ్బిలాలు వైరస్ యొక్క సాధారణ వాహకాలు, గబ్బిలాల లాలాజలం లేదా మూత్రం ద్వారా కలుషితమైన పండ్లను తినడం ద్వారా మానవులకు నిఫా వైరస్ సోకుతుంది. ప్రస్తుతం కేరళ ప్రభుత్వ నివేదిక ప్రకారం మరణించిన బాలుడి ప్రాథమిక సంప్రదింపు జాబితాలో 350 మంది ఉన్నారు, 100 మంది హై-రిస్క్ గా వర్గీకరించబడ్డారు. అదనంగా, పశుసంవర్ధక శాఖ వైరస్ కోసం పందులతో సహా జంతువులను పరీక్షిస్తోంది. మలప్పురానికి చెందిన 68 ఏళ్ల వ్యక్తి, నిఫా వైరస్ లాంటి లక్షణాలతో మరణించిన బాలుడితో సంబంధం లేని పరిస్థితిలో కోజికోడ్ మెడికల్ కాలేజీలో చేరాడు.మహారాష్ట్రలోని ఓ గ్రామం పేరుతో చాందీపురా వైరస్ కి ఆపేరు వచ్చింది. 1965లో ఈ వైరస్ బయటపడింది. ఈ వైరస్ కి రాబిస్ కు కారణమయ్యే వైరస్ లతో దగ్గరి సంబంధం ఉంది. చాందీపురా వైరస్ ప్రభావం ప్రచారంపై ప్రజలకు అవగాహన చాలా తక్కువగా ఉంది. ఇది తీవ్ర ప్రమాదాన్ని కలిగిస్తుంది, ముఖ్యంగా పిల్లలకు అధిక జ్వరం, మూర్ఛలు, అతిసారం, వాంతులు అకస్మాత్తుగా ప్రారంభమవుతాయి.

తీవ్రమైన సందర్భాల్లో చాందీపురా వైరస్ సంక్రమణ కోమాతో పాటు మరణానికి దారితీస్తుంది. ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ ప్రకారం, ఎన్సెఫాలిటిస్, మెదడు వాపు సోకిన వారిలో మరణానికి ఈ వైరస్ ప్రధాన కారణంగా తెలుస్తోంది. గుజరాత్ ప్రస్తుతం చాందీపురా వైరస్ వ్యాప్తిని ఎదుర్కొంటోంది. వైరస్ సోకిన సాండ్ ఫ్లైస్ లేదా డ్రైన్ ఫ్లైస్ నుంచి కాటు ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుంది. వైరస్ ని ఎదుర్కోవడానికి అక్కడి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రభావిత జిల్లాల్లో మలాథియాన్ పౌడర్ ను పిచికారీ చేస్తున్నారు. జ్వరసంబంధమైన కేసులకు ఇంటెన్సివ్ చికిత్స అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మరింత వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు నర్సులతో పాటు ఆశా, అంగన్ వాడీ వర్కర్లు వంటి అట్టడుగు స్థాయి కార్యకర్తలతో ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం, చందీపురా వైరస్ కు నిర్దిష్ట యాంటీవైరల్ చికిత్స లేదు, కాబట్టి రోగలక్షణ నిర్వహణపై దృష్టి సారించడంతో పాటు సంక్లిష్టతలను నివారించడంలో సహాయక సంరక్షణ అవసరం.హైదరాబాద్ లో నార్వాక్ వైరస్ విజృంభిస్తోంది. గత కొన్నిరోజులుగా హైదరాబాద్ లోని నిలోఫర్ ఆస్పత్రికి నార్వాక్ బాధితులు క్యూ కడుతున్నారు. లక్షణాలు తీవ్రంగా ఉంటే... ఆస్పత్రిలో చేర్పించి వైద్యులు. చికిత్స అందిస్తున్నారు. మరీ ముఖ్యంగా చిన్నారుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత లేకపోవడం, కలుషిత ఆహారం, కలుషిత నీళ్లు తీసుకోవడం వల్ల ఈ వైరస్ ప్రబలుతుందని వైద్యులు అంటున్నారు . తీవ్రమైన డీహైడ్రేషన్, నిస్సత్తువ, ఏం తినలేని పరిస్థితి ఉంటే మాత్రమే ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించాలని చెబుతున్నారు.

---

# విద్యార్థినికి సీఎం భరోసా

- ఐఐటీ - జేఈఈ లో మధులతకు 824 ర్యాంకు
- ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమయ్యే పరిస్థితి
- విషయం తెలియడంతో స్పందించిన రేవంత్ రెడ్డి
- గిరిజన సంక్షేమ శాఖ ద్వారా సాయం అందజేత

**హైదరాబాద్, జూలై 24, (ప్రజాస్వరం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంత బిజీగా ఉన్నప్పటికీ తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యల విషయంలో చురుగ్గా స్పందిస్తున్నారు. తాజాగా మధులత అనే విద్యార్థిని ఐఐటీ – జేఈఈలో మంచి ర్యాంక్ తెచ్చుకున్నప్పటికీ.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు కొనసాగించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలిసిన వెంటనే రేవంత్ రెడ్డి స్పందించారు. ప్రఖ్యాత ఐఐటీలో సీటు సాధించినందుకు మధులతకు రేవంత్ అభినందనలు తెలిపారు.ఐఐటీలో చదువు కొనసాగించడానికి కావాల్సిన మొత్తాన్ని, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా తెలంగాణ ప్రజా ప్రభుత్వం విడుదల చేసిందని రేవంత్ ప్రకటించారు. మధులత రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన విద్యార్థిని. వీర్నపల్లి మండలం గోనే నాయక్ తండాకు చెందిన బదావత్ రాములు–సరోజ దంపతుల కుమార్తె. నిరుపేద కుటుంబం అయి నా చదువులో విశేష ప్రతిభ చూపేవారు. జేఈఈ మెయిన్ లో ఎస్టీ కేటగిరీలో 824వ ర్యాంక్ సాధించింది. కౌన్సెలింగ్ లో మధులతకు పాట్నా ఐఐటీలో సీటు వచ్చింది. ఎస్టీ విద్యార్థిగా ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు ఉన్నప్పటికీ.. జూలై 27 నాటికి హాస్టల్ , ఇతర ఖర్చుల కోసం రూ. 3 లక్షల వరకూ ఖర్చు పెట్టుకోవాల్సి ఉంటుంది. అంత డబ్బు తన దగ్గర లేకపోవడంతో తండ్రి రాములు కూడా ఏమీచేయలకపోయారు. కుటుంబ పోషణ కోసం మధులత కూడా మేకల కాపరిగా మారింది. చదువులో చురుకైన విద్యార్థిని, ఐఐటీలో సీటు వచ్చినా వెళ్లలేకపోతున్న దుస్థితిని ఆమె ఉపాధ్యాయులు గుర్తించారు. సాయం కోసం పలువురిని సంప్రదించారు. విషయం మీడియాకు తెలియడంతో.. కథనాలు ప్రసారం అయ్యాయి. వెంటనే ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. సీఎం రేవంత్ తక్షణం స్పందించి ఆమెకు కావాల్సిన ఆర్థిక సాయాన్ని మంజూరు చేయడంతో ఐఐటీలో చేరేందుకు వెళ్తున్నారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన జన్మదిన వేడుకలను హైదరాబాద్ లోని స్టేట్ హోం విద్యార్థినుల మధ్య జరుపుకొన్నారు. ఈ సందర్భంగా 100 మందికి ల్యాప్ టాప్ లను ఉచితంగా అందజేశారు.

---

# ఢిల్లీలో దీక్ష చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

కేటాయించకుంటే మేమేం చేస్తాం?' అని కేటీఆర్ పేర్కొన్నారు.

**బీఆర్ఎస్ వాయిదా తీర్మానం.. తిరస్కరించిన స్పీకర్**

జాబ్ క్యాలెండర్ తో పాటు నిరుద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను అసెంబ్లీలో చర్చించాలని కోరుతూ ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) వాయిదా తీర్మానాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కు ఇచ్చింది. కాగా ఈ వాయిదా తీర్మానాన్ని స్పీకర్ ప్రసాద్ తిరస్కరించారు. బీఆర్ఎస్ కోరిన అంశాలపై చర్చ జరిపేందుకు స్పీకర్ నిరాకరించారు. దాంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఆందోళనకు దిగారు. ప్ల కార్డులు ప్రదర్శించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

**పీఎంవో ముందు ధర్నా చేయండి – హరీశ్**

కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు నిధులు కేటాయించకపోవడంపై బీఆర్ఎస్ పార్టీ అసహనం వ్యక్తం చేసింది. రేవంత్ రెడ్డి గతంలో మోదీని పొగిడారని ఇప్పుడు కనీసం ఒక్క రూపాయి నిధులు కూడా తేలేదని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు చేసింది.'రేవంతూ... తెలంగాణ ప్రయోజనాల విషయంలో కేసీఆర్ నిబద్ధత ఏమిటో దేశం మొత్తం చూసింది. రెండు జాతీయ పార్టీలకు 16 సీట్లు కట్టబెడితే రాష్ట్రానికి అణా పైసా తేలేకపోయిన దద్దమ్మలు మీరు. బడే భాయ్ అంటివి. గుజరాత్ మోడల్ ఆదర్శం అంటివి. అదానీని అలుముకొంటివి. అయినా పైసా విదల్చడాయే మోదీ. తగుదునమ్మా అని ఇప్పుడు కేసీఆర్ కు సవాల్ విసిరితే జనం జాడిస్తరు మిమ్మల్ని' అని బీఆర్ఎస్ పార్టీ ఎక్స్‌లో పోస్ట్ చేసింది.

**పీఎంవో ముందు ధర్నా చేయండి – హరీశ్**

రాష్ట్రానికి నిధులు తేవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటు పోడియం దగ్గరికి వెళ్లి నిరసన తెలపాలని.. ప్రధాని కార్యాలయం ముందు ధర్నా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఇంకా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడు నెలల్లో పాల్పడ్డ కుంభకోణాలపై అసెంబ్లీలో నిలదీస్తామని.. ఈ నెల 25న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత అదే రోజున మేడిగడ్డ పర్యటనకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం బయలుదేరుతుందని చెప్పారు.. 26న మేడిగడ్డ కన్నెపల్లి పంప్ హౌజ్‌ను సందర్శిస్తామని చెప్పారు. లక్షల క్యూసెక్కుల నీరు గోదావరిలో వృథాగా పోతున్నా నీళ్లు ఎత్తిపోయడం లేదని.. మిడ్ మానేరు, కొండ పోచమ్మ సాగర్, రంగ నాయక సాగర్లలో నీళ్లు నింపి రైతుల పొలాలకు తరలించాలని కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచుతామని హరీశ్ రావు తెలిపారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ

**తెలంగాణలో మళ్లీ గాడిద గుడ్డు పోస్టర్లు**

హైదరాబాద్ : మళ్లీ తెలంగాణలో గాడిద గుడ్డు పోస్టర్లు వెలిసాయి. పార్లమెంట్ ఎన్నికల సమయంలో తెలంగాణకు పదేండ్లుగా అధికారంలో వున్న మోడీ సర్కార్.. చేసింది ఏమి లేదని, గాడిద గుడ్డని ప్రచారం చేసిన కాంగ్రెస్, మళ్లీ మంగళవారం ప్రవేశపెట్టిన పార్లమెంట్ బడ్జెట్ లో తెలంగాణకు మోడీ సర్కార్ ఏమి ఇవ్వలేదని ఫైర్ అయింది. తెలంగాణ నుండి 8 ఎంపీ సీట్లను గెలిపిస్తే.. రాష్ట్రానికి మోడీ సర్కార్ గాడిద గుడ్డు ఇచ్చిందని పోస్టర్లు వేసిన వైనం. గ్రేటర్ హైదరాబాద్ లోని పలు బస్టాండ్లకు హోర్డింగ్ లకు గాడిద గుడ్డు పోస్టర్లు వేలాడదీసారు.

**అర్హత ఉన్నవారందరికి ఉచిత కరెంట్**

200 యూనిట్లలోపు ఏ కుటుంబం వారు వాడుకున్నా, వారికి జీరో బిల్లులు ఇవ్వడంలో ఎటువంటి సందేహం లేదని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ 200 యూనిట్ల లోపు వాడుకుంటున్న వారిని ప్రభుత్వం ఎంపిక చేయలేదు. గ్రామసభలు పెట్టి, ఆ గ్రామసభల్లో రేషన్ కార్డు జతచేసి ప్రజలందరినీ దరఖాస్తు చేసుకొవాలని చెప్పడం జరిగింది. అలా వచ్చిన దరఖాస్తుల్లో అర్హత కలిగిన వారందరికీ 200 యూనిట్ల జీరో విద్యుత్ బిల్లులు అందిస్తున్నాం. అర్హతకలిగిన వారు గతంలో దరఖాస్తు చేసుకోకపోతే మండల, డివిజన్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఇదొక నిరంతరంగా జరిగే కార్యక్రమమని అన్నారు.



అసెంబ్లీ లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## 'జంతర్ మంతర్' వద్ద దీక్ష చేయడానికి సిద్ధం

**హైదరాబాద్ జూలై 24 :** రాష్ట్రానికి నిధులు తెచ్చేందుకు ఢిల్లీలో దీక్ష చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్ రావు, కేటీఆర్ డిమాండ్ చేయడంపై సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో స్పందించారు. ఢిల్లీలోని 'జంతర్ మంతర్' వద్ద దీక్ష చేయడానికి సిద్ధం అన్నారు. అయితే ప్రతిపక్ష నేతగా కేసీఆర్ కూడా రావాలన్నారు. మీరే తేదీని కూడా డిసైడ్ చేయండ న్నారు. 'తెలంగాణకు నిధులు తెచ్చుడో..సచ్చుడో తేల్చుకుందాం' అంటూ రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై జరిగిన చర్చలో అధికార, ప్రతిపక్ష నేతలు సూటిపోటీ మాటలనుకున్నారు. దాంతో సభ వేడెక్కినంత పనయింది. ఆంధ్ర సీఎం చంద్రబాబు నాయుడు సైలెంట్ గా కావలసింది రాబట్టుకున్న నేర్పు ఇక్కడ కనబడడం లేదు.



అసెంబ్లీ ఆవరణలో పోస్టర్లతో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

# మీ సహకారంతోనే డిపోకు పేరు తీసుకొచ్చా

## తాండూరు డీఎం సమత

**తాండూరు, జూలై 24(ప్రజా స్వరం) :**

డ్రైవర్లు కండక్టర్లు డిపో సిబ్బంది సమిష్టి సహకారంతోనే తాండూరు డిపోకు రాష్ట్రస్థాయిలో ఒక పేరు తెచ్చానని డిపో మేనేజర్ సమత పేర్కొన్నారు. తాండూరు డిపో నుంచి హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ డిపోకు ఆమె బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. డిపోలోని ఆమె ఛాంబర్ నుంచి గ్యారేజీ సమావేశం వేదిక వద్దకు ఉద్యోగులు, సిబ్బంది పూల వర్షం కురిపిస్తూ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. డిపో మేనేజర్ సమత మాట్లాడుతూ కన్నీటి పర్యంతమయ్యారు. అనంతరం ఆమె మట్లాడుతూ ఉద్యోగ బాధ్యతలు ఎవరినైనా మనసు నొప్పించి ఉంటే క్షమించాలని కోరారు. ఏ ఉద్యోగైనా క్రమశిక్షణ, విధి నిర్వహణలో అంకితభావం, పై అధికారుల ఆదేశాలను తూచా తప్పకుండా పాటించడం అలవర్చుకుంటే ఆ వ్యక్తికి సంస్థలో ప్రత్యేకమైన విలువ, స్థానం ఉంటుందన్నారు. డిపోలో కొన్ని సందర్భాలు మనోవేదనకు గురైనా మీ అందరి సహకారంతో తన బాధ్యతలను చక్కగా నిర్వర్తించానన్నారు. ఇప్పటివరకు 13 డిపోల్లో పనిచేశానని, ఎక్కడా విధుల పట్ల నిర్లక్ష్యం చేయకుండా, నిబద్ధత కోల్పోకుండా అంకిత భావంతో పని చేశానన్నారు. కొన్ని అత్యవసర సమయాల్లో కుటుంబ సభ్యులను కాదనీ విధులకే ప్రాధాన్యతనిచ్చానని పేర్కొంటూ కంటతడి పెట్టుకున్నారు. ఈ సందర్భంగా డిపో ఉద్యోగులు డ్రైవర్లు కండక్టర్లు ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవికిరణ్, కీర్తికుమార్, వెల్ఫేర్ కమిటీ సభ్యులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.



# స్మిత సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

**వికారాబాద్, జూలై 24 (ప్రజాస్వరం):**

వికలాంగులను కించపరిచే విధంగా ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టిన ఐఏఎస్ స్మిత సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్‌పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు దశరథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక వికారాబాద్ జిల్లా కమిటీ పట్టణ సీఐ సంతోష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దశరథ్, శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ అధికారిగా చెలామణి అవుతూ వికలాంగులకు కేంద్ర ప్రభుత్వ సర్వీస్‌లో రిజర్వేషన్స్ అవసరం లేదని ప్రకటించడం ఆమె అహంకారంకు నిదర్శనమన్నారు. ప్రతిభ ఎవరి సొత్తుకాదని, అంగవైలక్యం కలిగిన అనేక మంది సమాజంలో అద్భుతలు సృష్టిస్తున్నారన్నారు. స్మిత సబర్వాల్ వెంటనే వికలాంగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, అశోక్, గణేష్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

# పంటలను సంరక్షించుకోవాలి

**వికారాబాద్, జూలై 24 : (ప్రజా స్వరం) :**

వికారాబాద్ జిల్లాలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ముఖ్యంగా మెట్ట పైర్లకు నష్టం కలుగుతుందని వికారాబాద్ జిల్లా తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల్లో సాగులో ఉన్న పత్తి, కంది, పెసర, మినుము పంటలకు నష్టం కలుగుతుందన్నారు. వికారాబాద్ జిల్లాలో దాదాపు 5.75 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఖరీఫ్ పంటలను రైతులు సాగు చేస్తున్నారని, ఇందులో దాదాపు రెండు లక్షల ఎకరాల విస్తీర్ణంలో పత్తి పంటను, 1,75,000 ఎకరాల విస్తీర్ణంలో కంది పంటను రైతులు సాగు చేస్తున్నారన్నారు. దాదాపు 50 వేల ఎకరాల విస్తీర్ణంలో మినుము, పెసర తదితర ఆపరాల పంటలను సాగు చేస్తున్నారన్నారు. అయితే, లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు ముంపునకు గురై నష్టం కలుగుతుందన్నారు. రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# కేటీఆర్‌కు పైలెట్ బర్త్ డే విషెస్



**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వికారాబాద్ జిల్లా తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు రోహిత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.**

# కేటీఆర్‌కు శుభాకాంక్షలు

**వికారాబాద్, జూలై 24 (ప్రజాస్వరం) :**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి నివాసంలో బుధవారం కేటీఆర్ జన్మదిన వెడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు విఠల్‌రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్ర గౌడ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌చారి, బీఆర్ఎస్ బషీరాబాద్ అధ్యక్షులు నర్సిరెడ్డి, తాండూర్ అధ్యక్షులు వీరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజప్పగౌడ్, తలారి యాదప్ప, పట్టణ ప్రధాన కార్యదర్శి సలీం, యునస్, రాజన్‌గౌడ్, గుండప్ప, శరణబసప్ప, శ్రీధర్, ప్రశాంత్‌గౌడ్, ఆర్సీగౌడ్, రాఘవేంద్ర గౌడ్, ఇంతియాజ్, బాబా, మోయిజ్, శంషుద్దీన్, సందీప్‌రెడ్డి, రజాక్ నరసింహ, అశ్వక్ బాబా, మహమ్మద్ సోయల్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా కట్ట మైసమ్మ ఉత్సవాలు





**తాండూరు, జూలై 24 (ప్రజా స్వరం) :**

వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని 9వ వార్డు సాయిపూర్ వీరశివాజీనగర్ కాలనీలో శ్రీరాయికుంట కట్ట మైసమ్మ దేవాలయం పునర్ నిర్మాణం సందర్భంగా మూడురోజులపాటు పలు కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉత్సవాల ముగింపు సందర్భంగా ఊరేగింపు, హోమాలు, విగ్రహాలు, ధ్వజస్థంభం ప్రతిష్ఠించారు. ఆషాఢమాసం సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీపనర్సింహుల కుటుంబ సభ్యులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. మూడురోజులపాటు కళాకారుల నృత్యాల కోలహలంతో సాయిపూర్ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణంగా మారిపోయింది. ఈ కార్యక్రమంలో సాయిపూర్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# శారీరక వైకల్యంపై ఇంటింటి సర్వే చేయాలి

**వికారాబాద్, జూలై 24 (ప్రజా స్వరం):**

అంగవైకల్య రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ తెలిపారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి శారీరక వైకల్యంపై చేపట్టాల్సిన సర్వేపై ఏఎన్ఎం, ఆశ వర్కర్, అంగన్‌వాడీ, ఎంఎల్‌హెచ్‌పీ, సూపర్ వైజర్‌లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యదర్శి మాట్లాడుతూ గ్రామాల్లో శారీరక వైకల్యంపై ఇంటింటి సర్వే చేసే క్రమంలో క్షేత్ర స్థాయిలో ప్రతి బిడ్డను క్షుణ్ణంగా పరిశీలించి వైకల్యాలను గుర్తించాలన్నారు. ఆరు సంవత్సరాలలోపు ఉన్న పిల్లల్లో వైకల్యాన్ని త్వరలో గుర్తించి మెరుగైన వైద్యాన్ని అందిస్తే త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. అంగవైకల్యంతో పాటు శారీరక, మానసిక రుగ్మతలను కూడా గుర్తించి అవసరమైన చికిత్సలను చేయిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ అంగవైకల్యంతో ఇబ్బంది పడే పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పేదరికంతో ఉండే కుటుంబాలకు ఇలాంటి సర్వే మూలంగా ఎంతో లబ్ధి పొందుతారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఎం అండ్ హెచ్‌వో పల్వాన్ కుమార్, డీఐవో బుచ్చిబాబు, డాక్టర్ రవీందర్‌యాదవ్, డాక్టర్ శివరాజ్, డాక్టర్ హేమంత్‌లు పాల్గొన్నారు.



# మున్సిపల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

**మేడ్చల్, జూలై 24 (ప్రజాస్వరం) :**

అక్రమంగా నల్లా కనెక్షన్ ఇచ్చిన మున్సిపల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉమానగర్ కాలనీవాసి వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ బట్టు నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ సిబ్బంది సహకారంతోనే అక్రమ నల్లా కనెక్షన్లు పెరుగుతున్నాయని వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన ఇండ్లకు నల్లా కనెక్షన్లు ఎలా ఇస్తారని వెంకట్‌రెడ్డి ప్రశ్నించారు. సామాన్యుడికి నల్లా కనెక్షన్ కావాలంటే సవ లక్ష కారణాలు చెప్పే మున్సిపల్ అధికారులు, అక్రమ నిర్మాణదారుల దగ్గర నుండి డబ్బులు దండుకొని వారికి కొమ్ముగాస్తున్నారని వెంకట్‌రెడ్డి మండిపడ్డారు. అందిన కాడికి జేబులు నింపుకొని అక్రమ నల్లా కనెక్షన్లు ఇస్తున్న సదరు ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకొని అక్రమ నల్లా కనెక్షన్‌ను తొలగించాలని కోరారు.

# ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దు

## తాండూర్ ఆర్డీవో శ్రీనివాస్

**వికారాబాద్, జూలై 24 (ప్రజాస్వరం):**

వికారాబాద్ జిల్లా తాండూర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని తాండూరు, కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మండలాల తహశీల్దార్లు తమ మండలాల్లో రైతుల నుంచి ధరణిపై వచ్చిన ఫిర్యాదులకు వెంటనే పరిష్కారించాలని తాండూర్ ఆర్డీవో శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం తాండూరు, కొడంగల్ నియోజకవర్గం మండలాల తహశీల్దార్లతో సమీక్ష నిర్వహించారు.

# కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి

**మేడ్చల్, జూలై 24 (ప్రజాస్వరం) :**

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు నిధుల కేటాయింపులో దగా చేసిందని ఆరోపిస్తూ బుధవారం కాంగ్రెస్ శ్రేణులు మేడ్చల్‌లో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బడ్జెట్‌తో తెలంగాణకు ఒరిగిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడ్డ జిల్లాలు, ప్రాంతాలు కేంద్రానికి కనిపించలేదా అని ప్రశ్నించారు. తెలంగాణ నుంచి గెలిచిన 8 మంది ఎంపీలు తెలంగాణకు అనా పైసా తీసుకురాలేకపోయారని ఆరోపించారు. బడ్జెట్ కేవలం ఆ పార్టీ మ్యానిఫెస్టోలా ఉందని, బడ్జెట్లో అంకెలు ఉండాల్సి ఉన్న కేవలం ప్రకటనలు హామీలే ఉన్నాయన్నారు. విభజన చట్టం ప్రకారం ఆంధ్ర రాష్ట్రానికి నిధులు కేటాయించినప్పుడు తెలంగాణకు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ఓట్లతో గెలిచి కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షులు రమణారెడ్డి, నాయకులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి గౌడవెల్లి బాల్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సురేందర్ ముదిరాజ్, కౌన్సిలర్ కొడే మహేష్, మురళీగౌడ్, మహేష్ పాల్గొన్నారు.



# కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ఊసేది?

**తాండూరు, జూలై 24 (ప్రజాస్వరం):**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు లాభాలు తెచ్చే పెట్టే విధంగా.. పేద ప్రజలపై భారం మోపే విధంగా ఉన్నాయని వికారాబాద్ జిల్లా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ మాట్లాడుతూ విమర్శించారు. తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన బడ్జెట్ నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని వైయస్సార్ చౌరస్తా ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పోరేట్ల వారి ఆదాయానికి తగ్గ పన్నులు ఎందుకు విధించడం లేదని ప్రశ్నించారు. గత బడ్జెట్లో 30శాతంగా ఉన్న పన్నులను ఈ బడ్జెట్‌లో 22శాతానికి ఎందుకు తగ్గించారని ప్రశ్నించారు. సంపన్నుల మీద విధించే వారసత్వ పన్నును కనీసం ప్రాతిపాదించదానికి కూడా నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ రాబడులను 14.5శాతం చూపించిన ప్రభుత్వం ప్రజల నుండి సేకరించిన రాబడిని వారి కోసం ఖర్చు చేయకుండా రెవెన్యూ ఖర్చులు కేవలం 5.91శాతానికి ఎందుకు తగ్గించిందని నిలదీశారు. తెలంగాణ నుండి ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్న బడ్జెట్లో కనీసం తెలంగాణ పేరు ప్రస్తావించకపోవడం కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ పట్ల పక్షపాత ధోరణి తెలియజేస్తుందన్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం, 24 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM

# విమానం కూలి 18 మంది మృతి

## ఖాట్మాండు విమానాశ్రయంలో టేకాఫ్ తీసుకునే సమయంలో ప్రమాదం

## విమానంలో సిబ్బంది సహా 19 మంది.. పైలెట్‌కు తీవ్ర గాయాలు

### నేడు ఉదయం 11 గంటలకు ప్రమాదం

న్యూఢిల్లీ, జూలై 24 (ప్రజాస్వరం): నేపాల్ రాజధాని ఖాట్మాండులో ఘోర విమాన ప్రమాదం చోటు చేసుకుంది. త్రిభువన్ విమానాశ్రయంలో ఓ విమానం టేకాఫ్ తీసుకునే సమయంలో కూలిపోయింది. ఆ సమయంలో విమానంలో సిబ్బంది సహా 19 మంది ఉన్నారు. ఈ విమానం పోఖరాకు వెళ్తోంది. ఉదయం 11 గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. విషయం తెలియగానే ప్రమాదస్థలికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకొని, సహాయక చర్యలు చేపట్టారు. మంటలు చెలరేగడంతో ఆర్పేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. ప్రమాదం జరిగిన ప్రదేశం నుంచి ఇప్పటి వరకు ఐదు మృతదేహాలను వెలికి తీశారు. విమానం పైలట్ కెప్టెన్ మనీష్ షాక్యాను రక్షించిన సిబ్బంది సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. టేకాఫ్ సమయంలో విమానం రన్‌వే పైనుంచి జారిపడి కూలిపోయింది. కూలిన విమానం శౌర్య ఎయిర్ లైన్స్‌కు చెందినది.





# నీది మేనేజ్‌మెంట్ పేమెంట్ కోటా..

## అసెంబ్లీలో రేవంత్.. కేటీఆర్ పరస్పర విమర్శలు

### కష్టపడి కిందిస్థాయి నుంచి ముఖ్య మంత్రినయ్యా : రేవంత్

### రాజీవ్ గాంధీ, రాహుల్ గాంధీది ఏ కోటా? కేటీఆర్

### కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణ అసెంబ్లీలో వాడీవేడిగా చర్చ

### బీఆర్ఎస్ మారడం లేదు.. ప్రజలు ఓడించిన బుద్ధి రాలేదు

### కేంద్రం తెలంగాణపై వివక్ష చూపింది : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 24 (ప్రజాస్వరం) : తెలంగాణ శాసనసభ సమావేశాలు రెండో రోజు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో తెలంగాణకు కేటాయింపులు చేయకపోవడంపై నిరసనగా తీర్మానం చేయాలని నిర్ణయించి.. దీనిపై చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార విపక్షాల మధ్య వాడీవేడిగా చర్చ జరిగింది. కీలకమైన అంశంపై చర్చ జరుగుతుంటే ప్రతి పక్ష నేతగా కేసీఆర్ ఎందుకు సభకు రాలేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సభకు వస్తే ప్రధాని మోడీకి కోపం వస్తుందనే కేసీఆర్ రాలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు ఢిల్లీ వెళ్లి చీకట్లో బీజేపీతో ఒప్పందం చేసుకుని వచ్చారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్ ఇస్తూ రేవంత్ రెడ్డికి ఆన్సర్ చెప్పడానికి కేసీఆర్ అవసరం లేదు మేం చాలని.. ముందు మేం అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పండని అన్నారు. వెంటనే కేటీఆర్ కామెంట్స్ పై రేవంత్ రియాక్ట్ అయ్యారు. కేటీఆర్ అవగాహన రాహిత్యంతో సభను తప్పుదోవ పట్టించి సభను బయటకు వెళ్లిపోవాలని చూస్తున్నారని అన్నారు. తాను తండ్రి పేరును చెప్పుకుని మంత్రిని కాలేదని.. కింది నుంచి వచ్చానని అన్నారు. కేటీఆర్ మేనేజ్మెంట్ కోటాలో మంత్రి అయ్యారని. విదేశాల నుంచి వచ్చి ఎమ్మెల్యే అయ్యారని, తండ్రి పేరు చెప్పుకుని మంత్రి అయ్యారని విమర్శించారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ రేవంత్ పేమెంట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యారని మండిపడ్డారు. తనది మేనేజ్మెంట్ కోటా అయితే మరి రాజీవ్ గాంధీ, రాహుల్ గాంధీ ఏ కోటా అని ప్రశ్నించారు. అంతకుముందు ప్రశ్నోత్తరాల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా భారాస ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రజలు శిక్షించినా భారాస మాత్రం మారలేదన్నారు. తప్పులు చేశారని ప్రజలు శిక్షించినా మారలేదు. భారాస నేతలకు మంచి బుద్ధి కలగాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపిందని, ఇందుకు కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పంచాయతీలుగా మారిన తండాలకు రోడ్డు మార్గం లేదన్నారు. అన్ని తండాలకు మండల కేంద్రం నుంచి బీటీ రోడ్లు వేస్తామని తెలిపారు. తండాలకు విద్యుత్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడు లక్షల ఇళ్లకు తాగు నీరు ఇవ్వలేదని ఆరోపించారు. తండాలకు 100 శాతం రోడ్లు వేయాలని నిర్ణయించామన్నారు. తండాలు, గూడాల్లో అభివృద్ధి జరిగితేనే అసలైన అభివృద్ధి అన్నారు. ప్రజలు శిక్షించినా బీఆర్ఎస్ నేతలు మారలేదని విమర్శించారు. కాగా, అంతకుముందు నిరుద్యోగుల సమస్యలపై ఉభయ సభల్లో వాయిదా తీర్మానం కోరుతూ బీఆర్ఎస్ నోటీసు ఇచ్చింది. జాబ్ క్యాలెండర్ ప్రకటనతోపాటు ఇతర న్యాయ పరమైన డిమాండ్ల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న వైఖరి, నిరుద్యోగుల ఆందోళనలపై ప్రభుత్వ అణచివేత వైఖరిపై చర్చ చేపట్టాలని కోరుతూ వాయిదా తీర్మానం ఇచ్చింది. స్పీకర్ ప్రసాద్ కుమార్ కు కేటీఆర్ ఈ నోటీసు ఇచ్చారు.

## కేటీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవ చేస్తూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని కోరుకున్నారు. కేటీఆర్‌కు భగవంతుడు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలన్నారు. తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రికి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు పటోళ్ల కార్తీక్ రెడ్డి, క్రిషాంక్ తదితరులు ఆయనకు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. వారందరికీ కేటీఆర్ థ్యాంక్స్ చెప్పారు.

## ఆర్టీసీపై హరీశ్ వర్సెస్ పొన్నం



తెలంగాణ అసెంబ్లీలో ఆర్టీసీ కార్మికుల అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఆర్టీసీ కార్మికులను పీఆర్సీ పరిధిలోకి తెస్తామని చెప్పారని, దీనిని అమలు చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఆర్టీసీ విలీనంపై ఎప్పటిలోగా ఆపాయింటుమెంట్ డేట్ ప్రకటిస్తారో చెప్పాలన్నారు. అలాగే కార్మికుల యూనియన్ పునరుద్ధరణ ఎప్పుడు చేస్తారో స్పష్టం చేయాలన్నారు. ఆర్టీసీకి నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆర్టీసీ అంశాన్ని బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. యూనియన్లను రద్దు చేసి, ఇప్పుడు పునరుద్ధరణ గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. ఆర్టీసీ కార్మికులు 50 రోజులు సమ్మె చేసినా గతంలో పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్టీసీ సొమ్మును కూడా ప్రభుత్వం వాడుకుందన్నారు. కానీ తాము మాత్రం ఆర్టీసీకి రూ.300 కోట్లు ఇస్తున్నామని తెలిపారు. కొత్త బస్సులను కూడా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీలో 3,035 మంది ఉద్యోగులను నియమిస్తున్నామన్నారు. పని భారం పెరిగినా ఆర్టీసీ కార్మికులు బాగా పని చేస్తున్నారని కితాబునిచ్చారు.

## తుమ్మిడిహట్టి వద్దే కట్టాలి : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 24 (ప్రజాస్వరం): తెలంగాణ శాసన మండలిలో సాగునీటి ప్రాజెక్టులపై స్వల్పకాలిక చర్చ జరిగింది. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడారు. తుమ్మిడహట్టి వద్దే ప్రాజెక్టు కడితేనే ప్రాణహిత నది నుంచి పుష్కలంగా నీళ్లు అందుతాయన్నారు. ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.5 వేలకోట్లు కేటాయించాలని కోరారు. గంధమల్ల రిజర్వాయర్ అంశం సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉందని మరో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సభ దృష్టికి తీసుకొచ్చారు.



## సింగరేణిని ప్రైవేటీకరించం..

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి క్లారిటీ

న్యూఢిల్లీ, జూలై 24 (ప్రజాస్వరం): సింగరేణిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరించేది లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ వంశీకృష్ణ సింగరేణిని కాపాడాలని, ప్రైవేటీకరించవద్దని లోక్ సభలో కోరారు. ఈ అంశంపై కిషన్ రెడ్డి స్పందిస్తూ... సింగరేణి రాష్ట్ర ప్రభుత్వం అధీనంలో ఉందన్నారు. సింగరేణిని ప్రైవేటీకరించేది లేదని... తమ లక్ష్యంలో కూడా అది లేదన్నారు. సింగరేణికి పదేళ్ల నుంచి ఎలాంటి మైనింగ్ ఇవ్వలేదని, కానీ ఒడిశాలో తమ బీజేపీ ప్రభుత్వం రాగానే మైనింగ్ కోసం అనుమతులు మంజూరు చేశామని గుర్తు చేశారు. సింగరేణిపై నరేంద్రమోదీ ప్రభుత్వానికి కమిట్‌మెంట్ ఉందన్నారు.